బాధ పెట్టడమే.. బాబు నైజం

- చంద్రబాబును దుమ్మెత్తి పోస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు
- వలంటీర్లను తీసేయమనే అధికారం అతనికెవరిచ్చారని నిలదీత



ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్/జగదాంబ/అల్లిపురం : బాధ పెట్టడమే చంద్రబాబు నైజమని పింఛన్‌దారులు ముక్తకంఠంతో దుమ్మెత్తి పోశారు. తమకు పాతకష్టాలు పునరావృతం అయ్యాయని, 2014 నుంచి 2019 వరకు ఎన్నో కష్టాలు పడ్డామని తెలిపారు. పింఛన్ కోసం పడిగాపులు పడేవాళ్లమని, వేకువ జామునే వచ్చి కార్యాలయం ముందు కూర్చుండేవారమని గుర్తు చేసుకున్నారు. తీరిగ్గా జన్మభూమి కమిటీలు వచ్చేవని.. ఆపై వారి దయని బట్టి పెన్షన్లు అందజేసేవారన్నారు. అలాగని పైసా తీసుకోకుండా పింఛన్ ఇచ్చేవారా? అదీ లేదు. మా లాంటి వృద్ధులు, దివ్యాంగుల వద్ద ఒక్కో లబ్ధిదారుని నుంచి రూ. 200 వరకు లాగేసేవారని వాపోయారు. ఈ కష్టాలు ఎప్పుడు పోతాయా అనుకునే సమయంలో ఇంటికి పెద్ద కొడుకుగా జగన్‌బాబు కనిపించాడని మురిసిపోయారు. అవ్వాతాతల కష్టాలు చూశాడు.. అధికారంలోకి వచ్చిన వెంటనే పైసా ఎవరికీ ఇవ్వకుండా ప్రతి నెలా ఒకటో తేదీ 6 గంటలకే వలంటీర్ల ద్వారా పింఛన్ ఇస్తున్నాడని కొనియాడారు. అయితే ఎన్నికలు వచ్చాయని వలంటీర్లను రానివ్వకుండా చంద్రబాబు తమ లాంటి వారికి అడ్డు తగిలాడని విలవిల్లాడిపోయారు. మండుటెండలో అవస్థలు పడుతున్నాం.. మా ఉసురు చంద్రబాబుకు తగులుతుంది అంటూ వృద్ధులు, దివ్యాంగులు భానోజీనగర్ సచివాలయం వద్ద చంద్రబాబును ఉద్దేశించి ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది చంద్రబాబు పుణ్యమే..



చక్కగా ఇంటి వద్దకొచ్చి వలంటీర్లు పింఛన్లు ఇచ్చేవారు. చంద్రబాబు పుణ్యమా అని మేమంతా ఎండల్లో మాడి ఎక్కడికో వెళ్లి పెన్షన్లు తెచ్చుకోవలసి వస్తోంది. బాబు ప్రభుత్వం గనుక వస్తే మళ్లీ మాకు అదే పరిస్థితి దాపురిస్తుంది. జగన్‌బాబు రావాలి.. మా పింఛన్లు మాకు ఇంటి వద్దే ఇవ్వాలి.

– నీలాపు సత్తిబాబు, పిక్కిరిపేట, 35వ వార్డు

జగన్‌బాబు మమ్మల్ని బాగా చూసుకుంటాడు..



జగన్‌బాబు వచ్చి పింఛన్ రూ. 3 వేలు చేసిన నాటి నుంచి ఇంట్లో వాళ్లు గౌరవంగా చూస్తున్నారు. మేం కూడా ఇంటి వద్దే పింఛన్లు అందుకుంటూ హాయిగా ఉండేవాళ్లం. ఇప్పుడు చంద్రబాబు వలంటీర్లను రానీయకుండా మా పింఛన్లకు ఎసరు పెట్టాడు. జగన్‌బాబు వస్తేనే మాకు మేలు. అతను మమ్మల్ని బాగా చూసుకుంటాడు.

– రాజులమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

ఇలా బాధ పెట్టడం బాబుకు తగదు..



మా బాబు బుద్ధి మాంద్యంతో బాధపడుతున్నాడు. భానోజీనగర్‌లో ఉండేవాళ్లం. ఇల్లు చాలక హెచ్‌బీ కాలనీ వెళ్లిపోయాం. గత నెల వరకు వలంటీరే మేమెక్కడ ఉన్నామో తెలుసుకుని వచ్చి పింఛన్ అందజేశారు. ఇప్పుడు వలంటీర్లను ఆపేసారు. దాంతో హెచ్‌బీ కాలనీ నుంచి ఇక్కడికు ఆటోకు రానుపోను రూ.400 వరకు పెట్టుకుని వచ్చాం. వలంటీర్లను ఆపేసి మాలాంటి వాళ్లను బాధ పెట్టడం చంద్రబాబుకు తగదు.

– దివ్యాంగ పింఛన్‌దారు ఈగల రాఘవేంద్రస్వామి తల్లి ఆవేదన

ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చారు..



సచివాలయ ఉద్యోగులు ఈ రోజు ఇంటికొచ్చి పింఛన్ అందజేశారు. 1వ తేదీన అందాల్సిన పింఛన్ 4వ తేదీ వరకు ఇవ్వకపోవటంతో ఇబ్బంది పడ్డాం. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ అడ్డుకోవడం వల్లే ఇలా జరిగింది. లేకపోతే 1వ తేదీ ఉదయాన్నే వలంటీర్లు నాకు పింఛన్ అందజేసేవారు. ఇలాంటి బాధలు తప్పాలంటే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి.

– శివాల లక్ష్మణరావు, కంఠంవారివీధి

వలంటీర్లుండాలి..



పింఛన్ కోసం రెండు రోజులుగా ఎదురు చూస్తున్నాను. ప్రతి నెల 1వ తేదీన వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఇంక వాళ్లు రారని తెలిసింది. చంద్రబాబు ఆపేసాడంటున్నారు. అదే నిజమైతే మాలాంటి వాళ్లకు కష్టమే. ఈ వయసులో ఎక్కడికో వెళ్లి పింఛన్ నేనెలా తెచ్చుకోగలను. మాలాంటి వారి కోసం ఆలోచించి వలంటీర్లను కొనసాగించాలి.

– గిడుతూరి సన్నమ్మలు, బంగారమ్మమెట్ట ప్రాంతం

జగన్ గెలవాలి.. వలంటీర్లు రావాలి..



పెరాలసిస్ వ్యాధిగ్రస్తుడినైన నేను ఇంటికొచ్చి పెన్షన్ అందజేసే వలంటీర్లు రాక చాలా ఇబ్బంది పడ్డాను. వలంటీర్లు 1వ తేదీ పొద్దున్నే ఇంటికొచ్చి పెన్షన్ ఇచ్చినప్పుడు బాగుంది. ప్రతిపక్షాలు అనవసరంగా వలంటీర్ల సేవలను అనుమానిస్తున్నాయి. మాలాంటి వారికి వలంటీర్ల సేవలు ఎంతో అవసరం. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా గెలవాలి. వలంటీర్ల సేవలు కొనసాగించాలి.

– పసుమర్తి శివ, వెంకటేశ్వరమెట్ట

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విస్తృత తనిఖీలు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు చేస్తున్న సెబ్ అధికారులు

అల్లిపురం : మహారాణిపేట స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఆధ్వర్యంలో గురువారం అధికారులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమ మద్యం, నగదు రవాణా అరికట్టడంలో భాగంగా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని సీఐ మధుకుమార్ తెలిపారు. జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్‌తో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసులతో కలిసి సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు తనిఖీలు నిర్వహించారు. సీఐ రాజులనాయుడు, ఎస్‌ఐలు మోహన్, వేణు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్‌కు సత్కారం



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న మాత శ్రీ రమ్యానంద భారతి తదితరులు

అల్లిపురం : ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్‌ను హైదరాబాద్‌లోని హైటెక్ సీటీ పరిధిలో గల అన్నమాచార్య భావన వాహిన ఆధ్వర్యంలో సత్కరించారు. సర్వసిద్ధి వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శ్రీ శక్తి పీఠాధీశ్వరి మాత శ్రీ రమ్యానంద భారతి చేతుల మీదుగా ఆయన సత్కారం పొందారు. డాక్టర్ శోభారాజ్, డాక్టర్ నందకుమార్, ఏబీవీ విశాఖపట్నం శాఖ కో ఆర్డినేటర్ ఏవీఎస్ మూర్తి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



నిరాశ్రయులకు ఓటరు కార్డులు అందజేస్తున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

అల్లిపురం : స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాసదన్ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. ఏ ఒక్క పార్టీ, వ్యక్తుల ఒత్తిడికి లోనై ఓటు హక్కు దుర్వినియోగం చేయవద్దని హెచ్చరించారు. అలాంటివి జరిగినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అల్లిపురం, భీమ్‌నగర్ షెల్టర్లో ఎలాంటి గుర్తింపు కార్డులు లేని నిరాశ్రయులకు ఆమె గురువారం ఓటు కార్డులు పంపిణీ చేశారు. గత 10 సంవత్సరాలుగా అన్ని రకాల హక్కులు కల్పించగలుగుతున్నామన్నారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు అందిస్తున్న సహకారానికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూసీడీ డీపీవో ఫణిరాం తదితరులు పాల్గొన్నారు.

30 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితులను విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫాంలలో గురువారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన షేక్ సాధిక్, షేక్ గని బ్యాగ్‌లను తనిఖీ చేయగా బ్యాగుల్లో అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు రూ.1.50 లక్షల విలువైన 30 కేజీల గంజాయి గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ బాలాజీరావు తెలిపారు. వీరు విశాఖ మీదుగా సికింద్రాబాద్‌కు గంజాయిని రవాణా చేస్తున్నట్లు తెలిపినట్లు పేర్కొన్నారు.

కిరండూల్ పాసింజర్‌కు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్

తాటిచెట్లపాలెం : వేసవి వేళ ప్రయాణికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న విశాఖపట్నం – కిరండూల్ (08551 /08552) పాసింజర్ స్పెషల్ రైలుకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఏప్రిల్ 8 నుంచి జూలై 1 వరకు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేస్తున్నామని, ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు.

- వాల్తేర్ డివిజన్, కేకే లైన్ పరిధి బొర్రా గుహలు – కరకవలస స్టేషన్ల మధ్య బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నందున ఏప్రిల్ 10న విశాఖపట్నం – కిరండూల్ (08551), కిరండూల్ – విశాఖపట్నం(085520 పాసింజర్ రైళ్లు ఇరువైపులా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో అప్రమత్తం

మహారాణిపేట : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో అప్రమత్తంగా ఉంటున్నామని, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామని దక్షిణ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి సీతారామ్మూర్తి పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం దక్షిణ అసెంబ్లీకి చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో టర్నర్ సత్రం ఆర్‌వో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఓటు నమోదు ప్రక్రియ, కోడ్ అమలు, ర్యాండమైజేషన్, కేసుల నమోదు తదితర అంశాలపై చర్చించారు. తహసీల్దార్ ఎన్.వి.రమణ, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఎస్ఎస్ఎస్ వర్మ, జోన్ –4 కమిషనర్ ప్రసాదరావు, జీవీఎంసీ ఏసీపీ ఝాన్సీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

29వ వార్డు వలంటీర్ రాజీనామా



వలంటీర్‌గా రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న శివశంకర్ యాదవ్

డాబాగార్డెన్స్ : రాజకీయ కారణాలతో తమ సేవలకు ఆటంకం కలుగుతున్న దృష్ట్యా వలంటీర్లు రాజీనామాలు చేస్తున్నారు. తాజాగా 29వ వార్డు వెంకటేశ్వరనగర్ (21086175) సచివాలయ వలంటీర్ సారిపల్లి శివశంకర్ యాదవ్ రాజీనామా చేశారు. నిరుద్యోగులు, వృద్ధులు, వికలాంగులకు బాసటగా నిలిచిన సీఎం జగన్‌కు మద్దతుగా వార్డు నాయకుడు, మండల అధ్యక్షుడు పీతల వాసు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రచారంలో పాల్గొనకూడదు.. పాల్గొంటే సస్పెండ్ చేయిస్తామని చంద్రబాబునాయుడు భయపెట్టడం కాదు.. జగనన్నకు సపోర్ట్‌గా మేమే రాజీనామా చేస్తాం. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని శివశంకర్ యాదవ్ అన్నారు. కోరాడ సురేష్, బుల్లెట్ రవి, బెవర మహేష్, తమ్మినేని శ్రీను, వాకాడ రాధ, జయంతి, ఇల్లిపిల్లి క్రాంతి, మహేశ్వరి, కమల, కనకల రాజు, సంతోష్ యాదవ్, కోరాడ అప్పారావు, నొడగల శివ, కొండ్రి సతీష్, వడ్డాది శివ, చలమరెడ్డి చిన్నారావు, సొండి చల్లారావు, నూకాలమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లి గెలుపు కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు



వాసుపల్లిని ఆశీర్వదిస్తున్న ఫాదర్ జాన్‌ప్రకాష్



యాదవ సంఘం ప్రతినిధులతో వాసుపల్లి

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్ చర్చిలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం సాయంత్రం విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్‌ను కలిసి మద్దతు కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్‌తో కలిసి ఫాదర్ ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం వాసుపల్లి గణేష్‌కుమార్ గెలుపు కోరుతూ ఫాదర్ జాన్‌ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

యాదవ సంఘం ప్రతినిధులను కలిసిన వాసుపల్లి..

జ్ఞానాపురంలో పలువురు యాదవ సంఘం ప్రతినిధులను వాసుపల్లి గణేష్‌కుమార్ కలిసి వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించాలని కోరారు. లియోజీరావు, పాత్రపల్లి వేళంగిణిరాజు, పాత్రపల్లి సునీల్ కుమార్ యాదవ్ తదితరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సమస్యల పరిష్కారమే అజెండా

- 34వ వార్డు ఎన్నికల ప్రచారంలో వాసుపల్లి గణేష్‌కుమార్
- అడుగడుగునా హారతులు పట్టిన ప్రజలు



కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



వాసుపల్లి, తోట పద్మావతికి పూలతో ఘనంగా స్వాగతం పలుకుతున్న స్థానికులు



కొబ్బరితోటలో ఓటర్లకు అభివాదం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ప్రజా సమస్యలే తన అజెండా అని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 34వ వార్డు పర్యటనలో భాగంగా కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో గురువారం జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయన బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయన కొబ్బరితోట వద్ద ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులను పలకరిస్తూ, అభివాదం చేస్తూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎక్కడికక్కడ ప్రజలు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో పుట్టి పెరిగిన తనకు ఈ ప్రాంతంతోను, ఇక్కడి ప్రజలతోను సత్సంబంధాలు ఉన్నాయన్నారు. పేదల కష్టసుఖాలు తెలిసిన వాడినన్నారు. పాతనగరం అభివృద్ధి, పొల్యూషన్ వంటి సమస్యల పట్ల తనకు పూర్తిగా అవగాహన ఉందన్నారు. పేదల ఆర్థిక అభివృద్ధి, పాతనగరం ఆధునికీకరణ జగనన్న ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ప్రజలు మరొకసారి జగనన్నను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 34వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీను, లండా రమణ, వార్డు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను నామరూపాలు లేకుండా చేయాలి



వృద్ధురాలికి అభివాదం చేస్తున్న వాసుపల్లి

దక్షిణ నియోజకవర్గంలోని 34వ వార్డులో గురువారం ఎన్నికల ప్రచారం చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కుళ్లు, కుతంత్రాలు చేస్తున్న ప్రతిపక్షాలను నామరూపాలు లేకుండా చేయాలని ప్రజలను కోరారు. అవ్వాతాతలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇంటికే పెన్షన్ అందజేసే వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు కుట్ర పన్నారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం వస్తే మళ్లీ అటువంటి రోజులే వస్తాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల విస్తృత ప్రచారం



వెలంపేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న అలపన కనకరెడ్డి



36వ వార్డు ప్రచారంలో భాగంగా మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న మేరీజోన్స్



39వ వార్డులో ప్రచారం చేస్తున్న కొల్లి సింహాచలం



30వ వార్డులో ప్రచారం చేస్తున్న కోడూరు అప్పలరత్నం



33వ వార్డులో ప్రచారం చేస్తున్న బొర్రా విజయలక్ష్మి తదితరులు

జగదాంబ : జగనన్న ప్రభుత్వమే వస్తుంది.. మళ్లీ మీ పింఛన్ మీ ఇంటికే వస్తుందని జీవీఎంసీ 35వ వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి అన్నారు. గురువారం పార్టీ నాయకలతో కలిసి వెలంపేట, పిక్కిరిపేట, లక్ష్మీనగర్, పూలసందు, మేదర వీధి, మంచాల వీధి, నూనెమిల్లు వీధి, పూర్ణామార్కెట్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ కరప్రతాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో..

డాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ని గెలిపించాలంటూ 31వ వార్డులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ గురువారం వార్డులో విస్తృత ప్రచారం చేశారు.

36వ వార్డులో..

జీవీఎంసీ 36వ వార్డులో ఆ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్ గురువారం వార్డు పరిధి పలు ప్రాంతాల్లో పర్యటించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో వార్డు నాయకుడు మాసిపోగు రాజు, స్థానికులు పాల్గొన్నారు.

29వ వార్డులో..

జీవీఎంసీ 29వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో మండల అధ్యక్షుడు పీతల వాసు నాల్గో రోజు ముమ్మరంగా ప్రచారం చేశారు. విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలంటూ ఓటు అభ్యర్థించారు.

39వ వార్డులో..

జీవీఎంసీ 39వ వార్డులో మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం గురువారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఎంపీగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ని గెలిపించాలంటూ కదిరి దానప్ప వీధి, కోటవీధి, అంబుసరంగ్‌వీధి, ఫెర్రీరోడ్డు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు.

30వ వార్డులో..

మహారాణిపేట : జీవీఎంసీ 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులోని సాలిపేట, మంథా వారి వీధి, కుమ్మరివీధి, ముస్లిం ఏరియాల్లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యేగా వాసుపల్లిని గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దశమంతుల చిన్ని పాల్గొన్నారు.

బంగారమ్మమెట్టలో..

అల్లిపురం : నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆడారి వెంకట మహేష్ ఆధ్వర్యంలో గురువారం 33వ వార్డులోని బంగారమ్మమెట్ట, అమ్మవారివీధి, వెంకటేశ్వరమెట్ట ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

33వ వార్డులో..

రానున్న ఎన్నికల్లో వాసుపల్లిని ఎమ్మెల్యేగాను, బొత్స ఝాన్సీని ఎంపీగాను ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించుకోవాలని, తద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని 33వ వార్డు నాయకులు పచ్చిరిపల్లి రాము, ఎం.రమేష్, గురువారం వెంకటేశ్వరమెట్ట, మూడుగుళ్లు, సాయిబాబా రోడ్డు, పాలసంఘం రోడ్డు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వాసుపల్లి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, మార్కెట్ వర్తకులు



వాసవీ కన్యకా పరమేశ్వరి సహిత ఎస్‌కేఎంఎల్ కళింగ వైశ్య సేవా సంఘం సభ్యులతో వాసుపల్లి

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డుకు చెందిన టీడీపీ, జనసేవ నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం ఆశీలమెట్టలోని ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి కార్యాలయంలో వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో పూర్ణామార్కెట్ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు, వర్తకులు పార్టీలో చేరారు. వీరికి కండువా కప్పి వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ చంద్రబాబును నమ్మి మోసపోయామన్నారు. రాష్ట్రంలో జగనన్న, నియోజకవర్గంలో వాసుపల్లి చేస్తున్న అభివృద్ధి, పేదలకు అందజేస్తున్న మేలు చూసి పార్టీలో చేరామన్నారు. వాసుపల్లి గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వార్డు నాయకులు ఆదివిష్ణు, సుబ్రహ్మణ్యం, మార్కెట్ వర్తక సంఘం నాయకులు గుజ్జు శ్రీనివాస్, నాయిన రెడ్డి, సురేష్‌బాబు, చిన్నబాబు, రమణమ్మ, దేవీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు..

అల్లిపురం : గురువారం రాత్రి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో ఆశీలమెట్ట పార్టీ కార్యాలయంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం ఆధ్వర్యంలో వార్డు బాయ్స్ కాలనీకి చెందిన యువకులు పార్టీ కండువాలు కప్పుకున్నారు. వారిని వాసుపల్లి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వార్డుబాయ్స్ లైన్‌లో సమస్యలు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని, వేణు, ఆంజనేయస్వామి టెంపుల్ చైర్మన్ దిలీప్, రామలక్ష్మి, బాబీ, గోవింద్, మైఖేల్ పాల్గొన్నారు.

పార్టీలో చేరిన 33వ వార్డు జనసేన మహిళలు..

వార్డు నాయకుడు పచ్చిరిపల్లి రాము, ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో 33వ వార్డు టీడీపీ, జనసేనకు చెందిన మహిళలు పార్టీలో చేరారు. వారిని వాసుపల్లి గణేష్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు కోట్లాది రూపాయల సంక్షేమ పథకాలు, వడ్డీ లేని రుణాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్ననకు దక్కుతుందన్నారు. వార్డు నాయకులు లక్ష్మీ కాంతం, కొల్లి సత్యవతి, చంద్రకళ, గంగ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి సహిత ఎస్‌కేఎంఎల్ కళింగ వైశ్య సేవా సంఘం ప్రతినిధులు వాసుపల్లి గణేష్‌కుమార్‌కు మద్దతు తెలిపారు. రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ సకలా భక్తుల ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి సహిత ఎస్‌కేఎంఎల్ కళింగ వైశ్య సేవా సంఘం (గొల్లవీధి, వన్‌టౌన్) సభ్యులు తమ మద్దతు తెలిపారు. వారిని వాసుపల్లి గణేష్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సంఘం అధ్యక్షుడు బాటం నారాయణ గుప్త, కార్యదర్శి వారణాసి రమేష్, కోశాధికారి ఇప్పిలి సుధాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వార్డుబాయ్ లైన్ యువకులతో వాసుపల్లి గణేష్‌కుమార్